



గుడివాడలో టీడీపీ కార్యకర్తలను నిలువరిస్తున్న పోలీసులు



అలలపై అలా అలా..

కృష్ణానదీ తీరంలో 'కపుల్ అండ్ ఫ్యామిలీ క్యాండిల్ లైట్' డిన్నర్

- కూటమి ప్రభుత్వం కొలువుతీరగానే అందుబాటులోకి..
- ఐదేళ్ల తర్వాత మళ్లీ పర్యాటక శోభ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానది అలలపై తేలియాడుతూ, వాటర్ జెట్టీపై కొవ్వొత్తుల వెలుగుల్లో డిన్నర్ చేయడం ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు. కొద్దిరోజుల్లో ఈ కపుల్ అండ్ ఫ్యామిలీ క్యాండిల్ లైట్ డిన్నర్ డైలీ ఈవెంట్‌ను నిర్వహించటానికి పర్యాటకాభివృద్ధి సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే హరిత బెర్మ్‌పార్క్ బోటింగ్ మినీ ఎంట్రీ పాయింట్ వద్ద ఏర్పాట్లు మొదలుపెట్టారు. కూటమి ప్రభుత్వం కొలువుతీరగానే, ఈ కార్యక్రమం ప్రారంభంకానుంది. మళ్లీ ఐదేళ్ల కిందటి పర్యాటక శోభను తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగానే ఈ ప్రణాళిక వేశారు. కృష్ణానదిలో మెయిన్ బోటింగ్ ఎంట్రీ పాయింట్‌కు కూతవేటు దూరంలో ఉన్న మినీ ఎంట్రీ పాయింట్ దగ్గర ఈ డైలీ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. సాధారణంగా ఇలాంటి క్యాండిల్ లైట్ డిన్నర్లను సముద్రం లేదా నదీతీరంలోని ఇసుక మేటలపై నిర్వహిస్తారు. ప్రస్తుతం కృష్ణానది తీరం వెంబడి ఘాట్లలో ఈ డిన్నర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే హరిత బెర్మ్‌పార్క్ సమీపంలో వాటర్ జెట్టీపై పోల్స్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఈ పోల్స్ చుట్టూ తెల్లటి వస్త్రాలతో పరదాలను ఏర్పాటు చేస్తారు. లోపల రౌండ్ డైనింగ్ టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేస్తారు. ఇక్కడ వెలుగులు ఇచ్చేందుకు పెద్దపెద్ద కొవ్వొత్తులు ఏర్పాటు చేస్తారు. జంటగా కానీ, కుటుంబ సమేతంగా కానీ డిన్నర్ చేయాలనుకునేవారు ముందే బుకింగ్ చేసుకోవాలి. దీనికి సంబంధించిన ఫోన్ నెంబర్‌ను తర్వాత ప్రకటిస్తారు.

రోజూ ఫుడ్ ఫెస్టివల్స్

కేంద్ర జలరవాణా సంస్థ నుంచి పర్యాటకాభివృద్ధి సంస్థకు నాలుగు వాటర్ ఫంట్స్ వచ్చాయి. ఈ ఫంట్స్‌లో రెండింటిని జాయింట్ చేసి రోజూ ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తారు. అన్‌లిమిటెడ్ ఫుడ్ పేరుతో వారంలో రోజూ ఒక స్పెషల్ ఫుడ్‌తో ఫెస్టివల్ నిర్వహించేందుకు మెనూ రూపకల్పన చేస్తున్నారు. సీ ఫుడ్, బిర్యానీలు, గోదావరి, రాయలసీమ రుచులను ప్రత్యేకంగా అందించనున్నారు.


కట్టలు తెంచుకున్న ఆగ్రహావేశాలు!

- వైసీపీ శిలాఫలకాల ధ్వంసం
- టీడీపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు.. నందిగామలో ఉద్రిక్తత

- 6లో..

టీడీపీ శ్రేణులు ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. వైసీపీ శ్రేణులు ఓడిపోయినా కవ్వింపు చర్యలకు దిగడంతో సహనం నశించి ముందుకు కదులుతున్నారు. అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వల్లభనేని వంశీతో పాటు చంద్రబాబు, లోకేశ్‌పై నిత్యం బూతులతో దాడి చేసిన కొడాలి నానీకి బుద్ధి చెప్పాలనుకున్నారు. శుక్రవారం విజయవాడలోని వంశీ ఇంటిపై, గుడివాడలోని కొడాలి నాని ఇంటిపై దాడికి దిగారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయినా, తాను ఓడిపోయినా రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న కొడాలి నాని మాట నిలబెట్టుకోవాలని ఆందోళన చేపట్టారు. ఆగ్రహంతో ఉన్న టీడీపీ శ్రేణులను నిలువరించాల్సిన పోలీసులు లాఠీచార్జి చేయడంతో విజయవాడలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి/గుడివాడ



విజయవాడలో టీడీపీ కార్యకర్తపై పోలీసుల లాఠీచార్జి

సహనం నశించి..

తిరగబడిన తెలుగు తమ్ముళ్లు

విజయవాడలో వల్లభనేని వంశీ ఇంటిపై దాడి.. కార్లు ధ్వంసం

గుడివాడలో కొడాలి నాని ఇంటిపై కోడిగుడ్లు విసిరి నిరసన

- వంశీ కవ్వింపులతో రెచ్చిపోయిన యార్లగడ్డ వర్గం
- టీడీపీ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న నాని
- మాట నిలబెట్టుకోవాలని తెలుగు యువత నినాదాలు
- రెండుచోట్లా పోలీసుల ఓవరాక్షన్
- విజయవాడలో టీడీపీ నాయకులపై లాఠీచార్జి
- పలువురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

విజయవాడలో వంశీ ఇంటిపై దాడి

- టీడీపీ నాయకులపై పోలీసుల లాఠీచార్జి

నిత్యం కవ్వింపు చర్యలకు పాల్పడిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌పై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అభిమానులు రెచ్చిపోయారు. శుక్రవారం విజయవాడలోని వంశీ ఇంటికి వచ్చిన టీడీపీ కార్యకర్తలు.. దమ్ముంటే వంశీ నేరుగా వచ్చి తమతో తలపడాలని, పిరికిపందలా తన అనుచరులతో కవ్వింపు చర్యలకు దిగడం సరికాదని నినాదాలు చేశారు. వంశీ కార్లను ధ్వంసం చేశారు. యార్లగడ్డ అభిమానులు భారీగా తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. టీడీపీ అభిమానులను చెల్లాచెదురు చేసేందుకు లాఠీలను ప్రయోగించారు. దీంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వంశీ, ఆయన అనుచరులు చేసిన అరాచకాన్ని అడ్డుకోలేని పోలీసులు ఇప్పుడు తమను నిలువరించడం ఏమిటంటూ టీడీపీ కార్యకర్తలు తిరగబడ్డారు. ఘర్షణ విషయం తెలుసుకున్న యార్లగడ్డ వెంకట్రావు హుటాహుటిన ఘటనాస్థలికి తరలివచ్చారు. గాయపడిన కార్యకర్తలను పరామర్శించి, ఆసుపత్రికి తరలించారు. పలువురు టీడీపీ కార్యకర్తలను మాచవరం పోలీసుస్టేషన్‌కు తరలించడంతో విడిపించి తీసుకొచ్చారు. 'నాడు వైసీపీ నాయకులకు కొమ్ముకాసి నేడు మాపై దాడులా?' అంటూ యార్లగడ్డ వెంకట్రావు పోలీసులను నిలదీశారు.

గుడివాడలో కొడాలి నాని ఇల్లు ముట్టడి

- రాజకీయ సన్యాసం మాట నిలబెట్టుకోవాలని డిమాండ్

తెలుగు యువత నాయకుడు పొట్లూరి దర్శిత్ ఆధ్వర్యంలో గుడివాడ రాజేంద్రనగర్‌లోని కొడాలి నాని ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించారు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చినా, తాను గుడివాడలో ఓడిపోయినా రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కొడాలి నాని బయటకు వచ్చి రాజకీయ సన్యాసంపై స్పందించాలని కోరారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం తెలుగు యువత కార్యకర్తలు పలువురు కొడాలి నాని ఇంటిపైకి కోడిగుడ్లు విసిరి, మాట నిలబెట్టుకోకపోతే ఇదే శాస్తి జరుగుతుందని స్పష్టం చేశారు. సీలింగ్ ఫ్యాన్‌ను నేలకేసి కొట్టి నిరసన తెలిపారు. జై చంద్రబాబు అంటూ నాని ఇంటి వద్ద బాణసంచా కాల్చారు. డీఎస్పీ శ్రీకాంత్ రంగంలోకి దిగి దర్శిత్, తెలుగు యువత నాయకులతో మాట్లాడటంతో నిరసన విరమించారు. అనంతరం పొట్లూరి దర్శిత్ విలేకరులతో మాట్లాడుతూ గుడివాడలో కొడాలి నానీకి కౌంట్‌డౌన్ మొదలైందని, ఇంట్లో ఉండి పిరికివాడిలా దాక్కున్నాడన్నారు. దమ్ము,ధైర్యం లేనివాడు సవాల్ విసరకూడదని, సవాల్ స్వీకరించి వచ్చామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాజకీయ సన్యాసం చేస్తానని నాని చేసిన చాలెంజ్‌ను వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. అధికారం లేకుంటే నాని బతుకు కుక్క బతుకేనని మండిపడ్డారు.

పోలీసుల తీరుపై ఆగ్రహావేశాలు

వైసీపీ హయాంలో విచ్చలవిడిగా దాడులకు తెగబడినా ప్రేక్షకుల్లా చూసిన పోలీసులు నేడు తమపై లాఠీలు ఝుళిపించడం ఏమిటని టీడీపీ కార్యకర్తలు ప్రశ్నించారు. వైసీపీ హయాంలో టీడీపీ నేత పట్టాభి ఇంటిపై రెండుసార్లు దాడి చేశారు. ఆయన్ను కర్రలతో కొట్టి గాయపరచడమే కాకుండా ఆయన ఇంట్లో బీభత్సం సృష్టించారు. ఆ సమయంలో పోలీసుల నుంచి కనీస స్పందన లేకుండాపోయిందని, ఫిర్యాదు చేసినా చిన్నచిన్న కేసులు పెట్టి వదిలేసిన పోలీసులు ఇప్పుడు తమపై మాత్రం ఓవరాక్షన్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిలో నగరానికి చెందిన వైసీపీ కార్పొరేటర్లు, గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ జోగరాజు పాల్గొన్నట్లు సాక్ష్యాధారాల సహా అప్పట్లో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అప్పుడు కూడా పోలీసుల నుంచి కనీస స్పందన కరువైంది. టీడీపీ సీనియర్ నేత చెన్నుపాటి గాంధీపై దాడి చేసి కన్ను పోగొట్టిన ఘటనలో వల్లూరిపల్లి ఈశ్వర్ ప్రసాద్, గద్దె కల్యాణ్ తదితరులు ఉన్నట్లు సాక్ష్యాలతో సహా టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదు. గన్నవరానికి చెందిన టీడీపీ నాయకుడు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై జనవరి 21న వంశీ అనుచరులు దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన రంగబాబు నేటికీ కోలుకోలేదు. ఈ దాడికి సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తూతూమంత్రంగా విచారణ ముగించి చేతులు దులుపుకొన్నారు. వైసీపీ హయాంలో అడ్డగోలుగా వ్యవహరించిన పోలీసులు ఇప్పుడు శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న తమపై మాత్రం లాఠీలు ఝుళిపించడం ఏమిటనేది టీడీపీ నాయకుల ప్రశ్న.







గుడివాడలో ఫ్యాన్‌ను నేలకేసి కొడుతూ.. కొడాలి నాని ఇంటిపైకి కోడిగుడ్లు విసురుతున్న తెలుగు యువత శ్రేణులు.. వంశీ ఇంటి వద్ద పోలీసులు మోహరింపు

నియామకాలతో సరి..!

ఐదేళ్లుగా వైసీపీ గుప్పిట్లో కేడీసీసీబీ పాలకవర్గం



కేడీసీసీబీ కార్యాలయం

- జిల్లాలోని 421 పీఏసీఎస్‌లకు ఎన్నికల్లేవు
- త్రీమెన్ కమిటీలతోనే కాలయాపన
- కూటమి రాకతో ఎన్నికలు నిర్వహించే అవకాశం
- కేడీసీసీబీలో పాగా వేసేందుకు టీడీపీ సిద్ధం

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (కేడీసీసీబీ) పాలకవర్గం ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించలేదు. జిల్లాలోని 421 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) చైర్‌పర్సన్‌లుగా వైసీపీకి చెందిన నాయకులనే నియమించారు. సహకార వ్యవస్థపై కనీస అవగాహనలేని వారిని నామినేట్ చేశారు. త్రీమెన్ కమిటీల పేరుతో ఒక చైర్‌పర్సన్ ఇద్దరు డైరెక్టర్లను నియమించడంతో సహకార వ్యవస్థ కుదేలయ్యే పరిస్థితి దాపురించింది. కూటమి అధికారంలోకి రావడంతో కేడీసీసీబీ ఎన్నికలు జరిపి, సహకార వ్యవస్థను గాడిలోపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గత ఆరేళ్లుగా కేడీసీసీబీ పాలకవర్గం ఎన్నికల నిర్వహించలేదు. 2018 జనవరి 30వ తేదీ నాటికి కేడీసీసీబీ పాలకవర్గం పదవీకాలం పూర్తయింది. ఆరు నెలల పాటు ఈ పాలక వర్గాన్ని పొడిగించారు. ఆ తరువాత ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక అధికారుల పాలనలో కేడీసీసీబీ నడిచింది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో కేడీసీసీబీ ఎన్నికలు నిర్వహిస్తారని రైతులంతా ఆశించారు. కానీ నామినేషన్ పద్ధతిన వైసీపీ ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు పాలకవర్గాలను నియమిస్తూ వచ్చింది. వైసీపీ అధికారంలోకొచ్చాక అప్పట్లో ఆ పార్టీలో ఉన్న యార్లగడ్డ వెంకట్రావును కేడీసీసీబీ చైర్మన్‌గా నియమించింది. ఏడాదిపాటు ఆయనను ఆ పదవిలో ఉంచి అనంతరం వివిధ కారణాలతో తొలగించారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల కోడ్ అమ లులోకి రావడంతో మళ్లీ ప్రత్యేక అధికారి పాలనలో కేడీసీసీబీ కొనసాగింది. రెండేళ్లపాటు జగ్గయ్యపేటకు చెందిన తన్నీరు నాగేశ్వరరావు చైర్మన్‌గా నామినేషన్ పద్ధతిన పనిచేశారు. ప్రస్తుతం పెనమలూరుకు చెందిన తాతినేని పద్మావతి కేడీసీసీబీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. కేడీసీసీబీ పాలకవర్గంలో డైరెక్టర్లను శాసనసభ్యులు సిఫార్సుల మేరకే నియమిస్తూ వచ్చారు. ఈ ఐదేళ్ల వ్యవధిలో ముగ్గురు చైర్మన్లు మారడం గమనార్హం. సహకార వ్యవస్థలో అత్యంత కీలకమైన కేడీసీసీబీ పాలకవర్గం ఎన్నికలు నిర్వహించకుండా వైసీపీ ప్రభుత్వం కాలం వెళ్లదీసింది. పూర్తికాలం పాటు చైర్మన్, పాలకవర్గం సభ్యులు పనిచేస్తే రైతులకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకునే అవకాశం లేకుండా చేయడం వైసీపీ ప్రభుత్వానికే చెల్లుబాటు అయ్యింది. రూ.10వేల కోట్లకుపైగా టర్నోవర్ కలిగిన కేడీసీసీబీ పాలకవర్గానికి ఎన్నికలు నిర్వహించకపోవడం ప్రభుత్వ వైఫల్యమే.

పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిగి ఆరేళ్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 421 పీఎసీఎస్‌లు ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక పీఏసీఎస్‌లు జిల్లాలోనే ఉన్నాయి. వీటికి ఎన్నికలు నిర్వహిస్తే పాలకవర్గంలో 12 మంది డైరెక్టర్లు ఉంటారు. వీరిలో నుంచి ఒకరిని పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. వీరితోపాటు మరో కో-ఆప్షన్ సభ్యుడిని ఎన్నుకుంటారు. ఈ 13 మందితో పీఏసీఎస్‌లలో పరిపాలనా వ్యవహారాలపై సమావేశాలు నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటారు. రైతులకు ఏయే పంటకాలంలో ఎంతమేర పంటరుణాలు, లాంగ్‌టర్మ్ రుణాలు ఇవ్వాలి? డిపాజిట్ల సేకరణ, అంశాలపై అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు ఉండేది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్లపాటు పీఏసీఎస్ ఎన్నికలు నిర్వహించకుండా సాచివేత ధోరణిని అవలంబించింది. 2019 జూలై 31వ తేదీన పీఏసీఎస్‌లకు వైసీపీ నాయకులను త్రీమెన్ కమిటీ పేరుతో పాలకవర్గాలను నియమించింది.

త్రీమెన్ కమిటీలు తీసుకున్నవే నిర్ణయాలు

పీఏసీఎస్‌లకు ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా ఆయా నియోజకవర్గాల్లోని శాసనసభ్యులు సిఫార్సు చేసిన వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకే త్రీమెన్ కమిటీలో సభ్యులుగా చోటు దక్కింది. త్రీమెన్ కమిటీలలోని సభ్యులు తీసుకున్న నిర్ణయాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా అభ్యంతరం చెప్పేవారే లేకుండా పోయారు. దీంతో సహకార సంఘాల్లో పాలన గాడి తప్పిందనే చెప్పాలి. గత రెండు, మూడు సంవత్సరాలుగా పీఏసీఎస్‌లలో పీఏసీఎస్ చైర్మన్లు, సిబ్బంది ధాన్యం కొనుగోలులో కమీషన్లు దండుకుని రైతులను తమదైన శైలిలో దోచేశారు. ఇదేమని ప్రశ్నించిన రైతులను ఇబ్బందుల పాలుచేశారు. గూడూరు మండలం ముక్కొల్లు పీఏసీఎస్‌లో రైతులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించినా అక్కడ పనిచేసే ఉద్యోగి ఒకరు సుమారుగా రూ.25 లక్షలకుపైగా నగదును పక్కదారి పట్టించారు. రుణం చెల్లించినట్లుగా లెక్క చూపకపోవడంతో రైతులు సహకారశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా విచారణ జరగకుండా వైసీపీ నాయకులు తెరవెనుక చక్రం తిప్పారు.

పరారీలో గడ్డం గ్యాంగ్



నానితో గడ్డం గ్యాంగ్ (ఫైల్ ఫోటో)

షెడ్డుల తొలగింపు

- ప్లాట్‌లకు విముక్తి
- ఆనందంలో ప్లాట్‌ల యజమానులు



ప్లాట్‌లకి వెళ్లే దారిలో అక్రమంగా ఏర్పాటు చేసిన గేటు

గుడివాడ : కరోనా సమయంలో మాజీ మంత్రి కొడాలి నాని అండతో గడ్డం గ్యాంగ్ చేసిన అరాచకరాలు అన్నీఇన్నీ కావు. దొరికిన చోటల్లా కబ్జాలు చేసి గుడివాడలో భయానక వాతావరణం సృష్టించారు. మండలంలోని వలివర్తిపాడులోని రీసర్వే నెంబరు 180లోని చైతన్యనగర్ హౌసింగ్ సొసైటీలో 66 మంది ప్లాట్‌లను గడ్డం గ్యాంగ్ ద్వారా నాని కబ్జా చేశారని ఆరోపణలున్నాయి. ఎన్నికల కౌంటింగ్ వరకు ఆక్రమిత ప్రాంతంలో నాలుగు పక్కల షెడ్‌లను ఏర్పాటు చేసుకుని, చుట్టూ గేట్లు పెట్టి కాపలా కాసేవారు. సదరు ప్లాట్‌లలో పగులు, రాత్రి తేడా లేకుండా షిఫ్టుల వారీగా మందు, విందులతో గడ్డం గ్యాంగ్ రచ్చరచ్చ చేసేవారు. ఎవరైనా ప్లాట్‌లవైపు వస్తే దాడులు చేసేవారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ నేతృత్వంలో గడ్డం గ్యాంగ్‌తో పాటు రౌడీమూక రెచ్చిపోయింది. తన ప్లాట్‌ను చూసుకునేందుకు వెళ్లిన వ్యక్తిపై దాడి చేశారు. తాము కష్టపడి కొనుక్కున్న ప్లాట్‌లను కనీసం చూడటానికి కూడా వెళ్లకుండా అరాచకం సృష్టించారని ప్లాట్‌ల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల జరిగిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయంతో గడ్డం గ్యాంగ్ గుండెల్లో రైళ్లు పరిగెట్టాయి. కౌంటింగ్‌కు రెండు రోజుల ముందే గడ్డం గ్యాంగ్ పెట్టేబేడా సర్దుకుంది. కొడాలి నాని ఘోర ఓటమితో గడ్డం గ్యాంగ్ కనుమరుగైంది. వారు ఆక్రమించిన షెడ్లను ఖాళీ చేశారు. ఈ షెడ్డుల మీదుగా తమ ప్లాట్లకు వెళ్లేవారు ఇప్పుడు ఆనందంగా వెళుతున్నారు.

పోలీసుల ప్రేక్షక పాత్ర

గడ్డం గ్యాంగ్ అరాచకాలు సృష్టిస్తున్నారని ఫిర్యాదు చేసినా గుడివాడ పోలీసులు పట్టించుకోలేదు. ఎన్ని అరాచకాలు, కబ్జాలు, లూటీలు జరిగినా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు. ఎవరైనా ఫిర్యాదు చేయడానికి వస్తే వారితో ఎందుకు సర్దుకుపోవాలని ఉచిత సలహాలు సైతం ఇచ్చారు. ప్లాట్‌ల ఆక్రమణ, దాడి విషయంలో తాలుకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనా దర్యాప్తు ఇంచు కూడా ముందుకు సాగలేదు. కనీసం దాడికి పాల్పడిన వ్యక్తులెవ్వరో కూడా విచారణ చేపట్టలేదు. ఎక్కడి వేసిన గొంగడి అక్కడే మాదిరిగా కేసు నిలిచిపోయింది. ప్లాట్‌ల యజమానులకు మద్దతుగా టీడీపీ నాయకులు పోరాడారు.

టీడీపీ రాకతో పరార్

రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూటమి, గుడివాడలో టీడీపీ అభ్యర్థి గెలవడంతో నాని గడ్డం గ్యాంగ్ పరారైంది. నాని ఘోర ఓటమితో గడ్డం గ్యాంగ్‌లో భయం మొదలైంది. గుట్టుచప్పుడు కాకుండా షెడ్‌లను తొలగించారు. సామాన్లు సర్దేశారు. కౌంటింగ్ రోజు నానితో పాటు ఇద్దరు గడ్డం గ్యాంగ్ సభ్యులు పరారయ్యారు. ఎక్కడ ఉన్నది తెలియలేదు.

ప్లాట్‌లను స్వాధీనం చేసుకుంటాం

ఇన్నాళ్లూ తమ ప్లాట్‌లు ఆక్రమణకు గురయ్యాయని, టీడీపీ రాకతో ఆనందంగా ఉందని చైతన్య హౌసింగ్ సొసైటీ సభ్యులు తెలుపుతున్నారు. కష్టించి కొనుక్కున్న స్థలాలను ఆక్రమించారని అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. రెవెన్యూ, పోలీసులైతే వారితో ఎందుకు సర్దుకుపోవాలని ఉచిత సలహాలిచ్చారని గుర్తు చేసుకున్నారు.



ఈవీఎం, వీవీ ప్యాట్లను గోదాములో భద్రపరిచి సీలు వేయిస్తున్న దిల్లీరావు

ఈవీఎం, వీవీ ప్యాట్లకు పటిష్ట భద్రత

» ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిల్లీరావు



కృష్ణలంక, జూన్ 7 : సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణలో ఉపయోగించిన ఈవీఎం, వీవీప్యాట్లను కట్టుదిట్టమైన భద్రతతో గోదాములో భద్రపరిచినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.దిల్లీరావు వెల్లడించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తయినందున గొల్లపూడిలోని గోదాములో ఈవీఎం, వీవీ ప్యాట్లను భద్రపరిచి సీల్ వేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దిల్లీరావు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఎన్నికల సామగ్రిని భద్రపరిచే కలెక్టరేట్‌లోని గోదామును పరిశీలించి దానికి సీల్ వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచినట్టు తెలిపారు. ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎం, వీవీప్యాట్లను పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా గొల్లపూడిలోని గోదాములో భద్రపరిచినట్టు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించిన స్టాట్యుటరీ కవర్స్, ఫారాలు, రిజిస్టర్లు వంటి ఇతర ఎన్నికల సామగ్రిని జిల్లా కలెక్టరేట్‌లోని ప్రత్యేక గోదాములో భద్రపరిచినట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల కోడ్ : కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్నికల కోడ్ ముగిసింది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రవర్తనా నియమావళి అమలును నిలుపుదల చేసినట్టు కలెక్టర్ దిల్లీరావు శుక్రవారం తెలిపారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో మార్చి 16వ తేదీన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి అమల్లోకి వచ్చిన ప్రవర్తనా నియమావళి జూన్ 4వ తేదీన లెక్కింపు ముగిసిన 48 గంటల వరకు అమల్లో ఉందన్నారు. ఎన్నికలలో వెలువడిన ఫలితాలను బట్టి జిల్లాలో విజయవాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నూతనంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఖరారు చేయటంతో.. ఎన్నికల ప్రక్రియ ముగిసిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగియటంతో శుక్రవారం సాయంత్రం నుంచి కోడ్‌ను నిలుపుదల చేసినట్టు తెలిపారు.


ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నూతన నాయకులతో కలెక్టర్ దిల్లీరావు

కొత్త ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా..

కృష్ణలంక, జూన్ 7 : నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించి జిల్లాకు మరింత వన్నె తెచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ దిల్లీరావు అన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నగర శాఖలో ఖాళీ అయిన పదవులకు కో-ఆప్షన్ పద్ధతిలో ఎన్నిక కాబడిన నగరశాఖ అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్, సహాధ్యక్షుడు బి.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శి షేక్ నజీరుద్దీన్, కోశాధికారి డీఎస్ఎన్ శ్రీనివాస్‌లు సంఘ నాయకులతో కలిసి శుక్రవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇటీవల నిర్వహించిన సాధారణ ఎన్నికలు అత్యంత పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించడంలో ఉద్యోగుల సహకారం ఎంతో వుందన్నారు. కొత్త ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు ఉద్యోగులు బాధ్యతాయుతమైన సేవలను అందించేందుకు కృషి చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ ఎన్జీవో జిల్లా మాజీ కార్యదర్శి ఎండీ ఇక్బాల్ తదితరులున్నారు.



ఎస్పీ అద్నాన్ నయీం అస్మిని సత్కరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ, అధికారులు


అందరి సహకారంతో ఎన్నికలు ప్రశాంతం

» అధికారుల అభినందన సభలో కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో సార్వత్రిక ఎన్నికలను అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. అధికారులు, సిబ్బంది అభినందన సభ జెడ్పీ కన్వెన్షన్‌హాలులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సహకారంతో జిల్లాలో ఎక్కడా హింసాత్మక ఘటనలు జరగకుండా ఎన్నికలను నిర్వహించామన్నారు. ఎన్నికల విధుల్లో నోడల్ అధికారులు తమ బాధ్యతలను పూర్తిస్థాయిలో నిబద్ధతతో నిర్వహించారన్నారు. కృష్ణాజిల్లా నుంచి ఎన్నికల సంఘానికి వెళ్లిన నివేదికలు ఇతర జిల్లాల్లోనూ పాటించాలని ఎన్నికలసంఘం సూచన చేయడం గర్వకారణమన్నారు. పోలింగ్ రోజు అక్కడక్కడా స్వల్ప ఘటనలు చోటుచేసుకున్నా ఎస్పీ పరిస్థితులను చక్కదిద్దారని అన్నారు. జిల్లా మీడియా కూడా సమాచారాన్ని ఎప్పటికపుడు ప్రజలకు చేరవేసి ఎన్నికలు సక్రమంగా జరగడానికి తోడ్పాటును అందించిందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి, కలెక్టర్ సహకారం, సూచనలు అందించారన్నారు. అధికారులు, సిబ్బంది అలుపెరుగకుండా పనిచేశారన్నారు. జేసీ గీతాంజలి శర్మ, అధికారులు ఇచ్చిన సూచనలతో ఎన్నికలను సజావుగా నిర్వహించగలిగామని తెలిపారు. ఎస్పీ అద్నాన్‌నయీం అస్మిని కలెక్టర్, జేసీ ఘనంగా సత్కరించారు. కలెక్టర్, జేసీలను అధికారులు సత్కరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్త సీఎస్ నీరబ్‌తో ఉమ్మడి కృష్ణాకు అనుబంధం

» నీరబ్‌ను కలిసిన కలెక్టర్ దిల్లీరావు, జేసీ సంపత్ కుమార్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్ర చీఫ్ సెక్రటరీలుగా పనిచేస్తున్న వారిలో ఆదిత్యనాద్ దాస్ తర్వాత ఉమ్మడి కృష్ణాజిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన నీరబ్‌కుమార్ ప్రసాద్ తాజాగా సీఎస్ అయ్యారు. నీరబ్ కుమార్ ప్రసాద్ ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1993-95 మధ్య జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన కాలంలో ప్రజల్లో మంచి సౌమ్యుడుగా ఆయన పేరు తెచ్చుకున్నారు. నీరబ్ కుమార్ ప్రసాద్ తర్వాత 1995-1996 మధ్యకాలంలో ఆదిత్యనాద్ దాస్ జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆదిత్యనాద్ దాస్ ముందుగానే సీఎస్‌గా పనిచేశారు. సీఎస్‌గా నియమితులైన నీరబ్‌కుమార్‌ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌లు సీఎస్ నీరబ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను కలిసిన జాస్తి వీరాంజనేయులు



వన్‌టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా పదవీ బాధ్యతలు చేపట్టిన నీరబ్ కుమార్ ప్రసాద్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా అఖిలభారత పంచాయితీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ పంచాయితీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో కలిసారు. ఈ సందర్భంగా వీరాజంనేయులు నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.


నందిగామలో పలు సెంటర్లలో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన శిలాఫలకాలు

కట్టలు తెంచుకున్న ఆగ్రహావేశాలు!

» వైసీపీ శిలాఫలకాల ధ్వంసం

» టీడీపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు.. నందిగామలో ఉద్రిక్తత


స్టేషన్ నుంచి నేతలను బయటకు తీసుకువస్తున్న కార్యకర్తలు

నందిగామ, జూన్ 7 : నందిగామలో పోలీసులకు, టీడీపీ శ్రేణులకు మధ్య వివాదం చెలరేగింది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ భారీ మెజారిటీతో అధికారం చేపట్టడంతో ఐదేళ్ల ఆవేదనను పార్టీశ్రేణులు ఆగ్రహం రూపంలో వ్యక్తపరుస్తున్నారు. రెండు రోజులుగా పట్టణంలో వైఎస్ఆర్ పేరుతో ఉన్న బోర్డులను తొలగిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని పలు సెంటర్లలో వైఎస్ఆర్ బోర్డులతో పాటు మాజీ ఎమ్మెల్యే జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ పేర్లతో ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేశారు. రైతుపేటలో శిలాఫలకంపై మాజీ ఎమ్మెల్యే పేరు తొలగిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, టీడీపీ నాయకులకు మధ్య వాగ్వివాదం జరిగింది. పట్టణ అధ్యక్షుడు ఏచూరి రామకృష్ణ సహా పలువురు టీడీపీ కార్యకర్తలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన తంగిరాల సౌమ్య సీఐ హనీష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పోలీసులు స్పందించకపోవడంతో ఆగ్రహించిన టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున స్టేషన్‌ను చుట్టుముట్టారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకొనేందుకు విఫలయత్నం చేశారు. ఆగ్రహంతో పట్టుబడిన టీడీపీ నాయకులను బలవంతంగా బయటకు తీసుకువచ్చారు. ఈఘటన పట్టణంలో సంచలనంగా మారింది.

పోలీసుల తీరుపై సౌమ్య ఆగ్రహం

నందిగామలో శిలాఫలకాల ధ్వంసం చేసినప్పుడు వైసీపీ నేతలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని, జాతీయ నాయకుల విగ్రహాలను అవమానించినపుడు నోరు మెదపని పోలీసులు ఇప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఇదిలా ఉంటే జరిగిన ఘటనపై స్పెషల్ ఏసీపీ రాయ్, సీఐ హనీష్‌లు ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే అరెస్టు చేశామని, స్టేషన్ నుంచి అదుపులో ఉన్న వ్యక్తులను బలవంతంగా తీసుకువెళ్లడం సరికాదని సీఐ హనీష్ చెబుతున్నారు. ఉన్నతాధికారులు సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాధ్యతగా పనిచేస్తాం..

» చంద్రబాబుతో కేశినేని శివనాథ్

వన్‌టౌన్, జూన్ 7 : బాధ్యతగా పనిచేస్తామని, జాతీయ స్థాయిలో ఏపీ రాష్ట్ర కీర్తిప్రతిష్ఠలను పెంచుతామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఎన్డీఏ సమావేశానికి హాజరైన టీడీపీ ఎంపీలతో చంద్రబాబునాయుడు మాట్లాడారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎంపీలందరు సమష్టి కృషితో కలిసికట్టుగా పనిచేస్తామన్నారు.

మాతృభాషలో పాఠశాల విద్య కొనసాగాలి

» మండలికి తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షుడు వినతి



అవనిగడ్డ, జూన్ 7 : విద్యాహక్కు చట్టం ప్రకారం మాతృభాషలోనే పాఠశాల విద్య కొనసాగేలా కృషిచేయాలని తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి.తులసీనాథం నాయుడు ఎమ్మెల్యేగా ఎన్నికైన బుద్ధప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం బుద్ధప్రసాద్‌ను కలిసి తులసీనాథం నాయుడు చిత్తూరు జిల్లా పలమనేరును నుంచి సతీసమేతంగా విచ్చేసి బుద్ధప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

ముస్తాబాద-గన్నవరం మధ్య

పలు రైళ్ల డైవర్షన్

రైల్వేస్టేషన్, జూన్ 7 : ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా విజయవాడ రైల్వే డివిజన్‌లోని ముస్తాబాద, గన్నవరం మధ్య పలు రైళ్లను డైవర్షన్ చేసినట్టు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 18, 20 తేదీల్లో సికింద్రాబాద్-షాలీమార్, ఎస్ఎంవీబీ బెంగుళూరు-గౌహతి రైళ్లను విజయవాడ, గుడివాడ, నిడదవోలు మీదుగా మళ్లిస్తారు. ఇదే రూట్‌లో ఈ నెల 7, 8, 10, 11, 14, 15, 17, 18, 21, 22, 24, 25, 28, 29 తేదీలలో ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్-భువనేశ్వర్ రైలును మళ్లిస్తారు. 10, 11, 17, 18, 24, 25 తేదీలలో సోమవారం, మంగళవారం నడిచే ఎర్నాకుళం - పాట్నాల మధ్య నడిచే రైలును, బుధ, గురు, శుక్రవారాల్లో నడిచే ఎస్ఎంవీబీ బెంగుళూరు-గౌహతి రైలును ఈ నెల 7, 14, 21, 28 తేదీలలో, శనివారం నడిచే భావనగర్-కాకినాడ పోర్ట్ రైలును ఈ నెల 8, 15, 22, 29 తేదీలలో, లింగంపల్లి-విశాఖపట్నం మధ్య ప్రతిరోజూ నడిచే రైలును 8, 9, 11, 12, 15, 16, 18, 19, 22, 23, 25, 26, 29, 30 తేదీల్లో మళ్లిస్తారు. ప్రస్తుతం ఈ రైళ్లన్ని విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు మీదుగా నడుస్తున్నాయి. దారీ మళ్లించడంతో వీటిని విజయవాడ-గుడివాడ-నిడదవోలు మీదుగా మళ్లిస్తారు. లింగంపల్లి-విశాఖపట్నం రైలు నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెంలలో రైలుకు స్టాపింగ్ ఉందని తెలిపారు.

ఉద్యోగులను ఆదుకోవాలి

» టీడీ జనార్దన్‌ను కలిసిన పీఏసీఎస్ ఉద్యోగ సంఘ నేతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 7 : సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీవో నెం. 36ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఏపీ పీఏసీఎస్ ఉద్యోగ సంఘ నేతలు ఆప్కాబ్ మాజీ చైర్మన్ తొండెపు దశరథ జనార్ధ



న్‌ను కోరారు. టీడీపీ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా మంగళగిరిలో ఆప్కాబ్ మాజీ చైర్మన్‌ను శుక్రవారం కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన టీడీ జనార్ధన్ ప్రభుత్వం, మంత్రిత్వ శాఖలు ఏర్పడిన తరువాత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బ్యాంకింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ రవికుమార్, ఏపీ పీఏసీఎస్ ఉద్యోగ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురాం, జిల్లా కార్యదర్శి వీరపనేని రాజేశ్వరరావు, రాజా, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అధినేతను కలిసిన నెట్టెం, తాతయ్య




జగ్గయ్యపేట, జూన్ 7 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యలు వేర్వేరుగా ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో పార్టీకి ఘన విజయం అందించినందుకు నెట్టెంను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను నెట్టెం రఘురాం, రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార సమితి అధ్యక్షురాలు ఆచంట సునీతలు వేర్వేరుగా కలిసి అభినందించారు.


కొల్లు రవీంద్రను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘ నేతలు, క్రాఫ్ట్ టీచర్లు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

» కొల్లు రవీంద్రకు ఉద్యోగ సంఘాల వినతి

మచిలీపట్నం టౌన్, జూన్ 7 : సీపీఎస్ రద్దుచేసి పాత పద్ధతిలో పెన్షన్ ఇవ్వాలని ఎమ్మెల్యేగా గెలిచిన కొల్లు రవీంద్రకు శుక్రవారం సీపీఎస్ ఉద్యోగుల సంఘ నాయకులు సత్యనారాయణ, శోభన్‌బాబు తదితరులు వినతిపత్రం సమర్పించారు. సీపీఎస్ ఉద్యోగుల సంఘం, క్రాఫ్ట్ ఉద్యోగుల సంఘం నేతలు విజయశ్రీ, నాగమణి తదితరులు రవీంద్రను సత్కరించారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నాగమణి కోరారు. కాగా రవీంద్రను మునిసిపల్ కమిషనర్ బాపిరాజుతో పాటు పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘ నాయకులు నగేష్, ప్రాత్రికేయులు అభినందించారు. హెల్పింగ్ స్పాట్ సంస్థ ఫౌండర్ వెంట్రప్రగడ భార్గవ్, మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు రవీంద్రను కలిశారు.

దీక్ష విరమించిన టీడీపీ కార్యకర్త


కార్యకర్త దీక్షను విరమింపజేస్తున్న శావల దేవదత్

తిరువూరు, జూన్ 7 : 2019లో టీడీపీ ఓటమి చెందడంతో తీవ్రమనస్తాపానికి గురై.. చంద్రబాబు సీఎం అయ్యేవరకు పాదరక్షలు ధరించనని ఓ కార్యకర్త దీక్ష బూనాడు. ఈ ఎన్నికల్లో కూటమి ఘనవిజయంతో కార్యకర్త దీక్షను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి శావల దేవదత్ శుక్రవారం విరమింప జేశారు. ఎ.కొండూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గాడిచర్ల మారేష్, చీరాల సెంటర్‌లోని రైతు బజార్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. 2019లో టీడీపీ ఓటమి చెందడంతో తీవ్రమనస్తాపానికి గురైయ్యాడు. తిరుమలలో శ్రీవారి సమక్షంలో తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యేవరకు పాదరక్షలు ధరించనని దీక్ష బూనాడు. ఐదేళ్లుగా పాదరక్షలు లేకుండా తిరిగాడు. టీడీపీ కూటమి ఘన విజయం సాధించడంతో శావల దేవదత్ రైతుబజార్‌కు వెళ్లి మారేష్ దంపతులను సత్కరించి పాదరక్షలు అందించి దీక్ష విరమింప జేశారు.

ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్

అక్రమాలపై విచారణ చేపట్టాలి

» ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ డిమాండ్

వన్‌టౌన్, జూన్ 7 : ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. శుక్రవారం విజయవాడలోని ట్రైబల్ ప్రజాసమాఖ్య కార్యక్రమంలో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్పనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్పలు మాట్లాడారు. రాష్ట్రంలోని కొన్ని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలను ప్రైవేట్ యూనివర్శిటీలుగా మార్చి కోట్లాది రూపాయలను హేమచంద్రారెడ్డి అక్రమ మార్గంలో తీసుకోవడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాది మంది విద్యార్థులు ఎంసెట్ పరీక్షలు రాస్తే పరీక్ష ఫలితాలను విడుదల చేయ



మాట్లాడుతున్న ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్పనాయక్

కుండా విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వెళ్ళి కళాశాలలో చేరే విధంగా పక్క ప్రణాళిక తీసుకున్నారని విమర్శించారు. ప్రైవేట్ కళాశాలల నుంచి లక్షలాది రూపాయలు కమీషన్‌లుగా తీసుకుని నాక్(ఎన్ఏసీ) పర్యటనల పేరుతో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ రామ్మోహనరావు స్టార్ హోటల్‌లో బస చేస్తూ ఉన్నత విద్యామండలి నిధులను పెద్ద స్థాయిలో ఖర్చుచేశారన్నారు. ఉన్నత విద్యామండలిలో వారు వైసీపీ కార్యకర్తలను, ఉద్యోగులను నియమించుకోవడం సిగ్గుచేటన్నారు. గత ఐదేళ్ళ కాలంలో యూనివర్శిటీ ఉపకులపతులుగా వరకట్న వేధింపులు, గృహహింస కేసులు, అవినీతి ఆరోపణలున్న వారిని తమకు అనుకులంగా నియమించుకున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్ళ కాలంలో దాదాపుగా 150 కోట్ల మేర అవినీతి అక్రమాలకు పాల్పడిన ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, ఇతర అధికారుల మీద చట్టపరమైన విచారణ చేపట్టి క్రిమినల్ కేసులను నమోదు చేసి ఉన్నతవిద్యామండలిని కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషణ్ రాష్ట్ర నాయకులు రామ్‌రాజ్, వెంకటేష్, దివాకర్, ఈశ్వరయ్య, రఘునాథ్ నాయక్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇది చారిత్రక విజయం

» మండలికి బుద్దా వెంకన్న శుభాకాంక్షలు

అవనిగడ్డ, జూన్ 7 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి సాధించిన విజయం చారిత్రకమైనదని మాజీ



ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిలు అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించిన బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి ఆమడ దూరంలోకి వెళ్లిందని, నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవాలని ప్రజలు ఆయనకు రికార్డు మెజార్టీ ఇచ్చారని అన్నారు. బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

జగన్‌కు సరైన బుద్ధి చెప్పారు

» దేవినేని ఉమా

గొల్లపూడి, జూన్ 7 : వైనాట్ 175 అన్న జగన్మోహన్ రెడ్డికి ప్రజలు బ్రహ్మాండమైన తీర్పుతో బుద్ధి చెప్పారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తరమికొట్టారన్నారు. 151లో మధ్యలో ఉన్న 5 తీసేసి 11 సీట్లకే వైసీపీని పరిమితం చేశారంటే ప్రజల్లో జగన్మోహన్ రెడ్డిపై ఎంత కసి ఉందో అర్థమవుతుందన్నారు. పవన్ కల్యాణ్ కష్టకాలంలో సపోర్టుగా నిలవడం అందరి సహకారంతో కూటమి బ్రహ్మాండమైన మెజార్టీ సాధించి గెలిచిందన్నారు. రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు.

చిన్నారి పెద్ద మనస్సు

» సహ విద్యార్థి వైద్యానికి రూ.1.16లక్షల సేకరణ


విద్యార్థి తండ్రితో కలపాల జస్విక

గన్నవరం, జూన్ 7 : ఆ చిన్నారి వయస్సు పదేళ్లు.. గన్నవరం సెయింట్ జాన్స్‌లో మూడో తరగతి చదువుతోంది. తనతోటి విద్యార్థి ఈశ్వర్ సాయితేజేష్ అనారోగ్యంతో విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికే వైద్యానికి లక్షల్లో విద్యార్థి తల్లిదండ్రులు ఖర్చు చేశారు. ఇంకా రూ.12లక్షల వరకు అవసరమని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న చిన్నారి కలపాల జస్విక తన తండ్రి సహకారంతో బంధువులు, తెలిసిన వారు, పరిచయస్తులను సాయం కోరింది. ఒక్కరోజులోనే చిన్నారి రూ.1.16 లక్షలు సేకరించి ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న ఈశ్వర్ సాయి తేజేష్ తల్లిదండ్రులను శుక్రవారం కలిసి నగదును అందజేసింది. మంచి మనస్సుతో స్నేహితుడికి సాయం చేసిన ఆందరికీ కృతజ్ఞతలు తెలిపింది. ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలని ఉపాధ్యాయులు చెప్పిన మాటలు తన మనసులో నాటుకుపోయాయని జస్విక తెలిపింది. జస్వికను ఉపాధ్యాయులు, పెద్దలు అభినందించారు.


జాతీయ ఉపకార వేతనాల పరీక్షా ఫలితాలు విడుదల

వన్‌టౌన్, జూన్ 7 : జాతీయ ఉపకార వేతనాల పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబరు 3వ తేదీన ఈ పరీక్షలు జరిగాయన్నారు. ఫలితాలను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులను త్వరలో సంబంధిత మండల విద్యాశాఖాధికారులకు పంపుతామన్నారు. విద్యార్థులు ఏదైనా జాతీయ బ్యాంకులో పొదుపు ఖాతాను ప్రారంభించి తండ్రి లేదా తల్లితో జాయింట్ అక్కౌంట్ ఓపెన్ చేసుకుని విద్యార్థి ఆధార్ నెంబర్‌ను ఖాతాకు అనుసంధానం చేయాలన్నారు. ఎంపికైన విద్యార్థులు జాతీయ విద్యా మంత్రిత్వశాఖ నుంచి స్కాలర్‌షిప్ పోర్టల్ ప్రారంభం అవుతుందన్నారు. ఆ సమయంలో విద్యార్థులు తమ పేరు, తండ్రి పేరు, పుట్టినతేదీ, మెరిట్ లిస్ట్, మెరిట్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌లలో ఏ ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా చూసుకోవాలని కోరారు.


బేబి సరోజిని అంత్యక్రియల్లో పాల్గొన్న వర్లకుమార్‌రాజా

టీడీపీ నేత అంత్యక్రియల్లో కుమార్‌రాజా

పామర్రు, జూన్ 7 : మండల పరిధిలోని జమీగొల్వేపల్లి గ్రామ టీడీపీ నాయకురాలు తుమ్మల బేబీ సరోజిని (82) అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యేగా ఎన్నికైన వర్ల కుమార్‌రాజా శుక్రవారం ఉదయం ఆమె పార్థివ దేహంపై పార్టీ జెండా కప్పి, పూలమాలవేసి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆమె మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


మహిళకు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న జయరాం

స్వచ్ఛంద సంస్థలకు సాయమందించేందుకు కృషి

» ఎన్నారై కోమటి జయరాం

మైలవరం, జూన్ 7 : మహిళలు, యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు పలురంగాల్లో ఉచితంగా శిక్షణఇస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు కృషిచేస్తామని ఎన్నారై కోమటి జయరాం అన్నారు. మోస్ట్ ట్రస్టు, మదర్‌థెరిసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 45 రోజుల పాటు నిర్వహించిన ఉచిత కంప్యూటరింగ్, టైలరింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, హ్యాండ్ రైటింగ్, చెస్ శిక్షణ ముగించుకున్న వారికి శుక్రవారం ధ్రువీకరణ పత్రాలను ఆయన అందించి సంస్థ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కోయ సుధ, అప్పసాని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

10న విద్యాప్రదాత కోదండరామయ్య విగ్రహావిష్కరణ

గన్నవరం, జూన్ 7: గన్నవరం ప్రాంత విద్యాప్రదాత వేములపల్లి కోదండరామయ్య 110వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాన్ని తమ కళాశాలలో ఈనెల 10వ తేదీన ఏర్పాటు చేస్తున్నట్లు వీకేఆర్ కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు మోటపర్తి వెంకట్ తెలిపారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న వీకేఆర్ కళాశాలలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. 1969లో బుద్ధవరంలో 23ఎకరాల విస్తీర్ణంలో వీకేఆర్ కళాశాలను వేములపల్లి కోదండరామయ్య స్థాపించారని తెలిపారు. వేలాది విద్యార్థులుండే కళాశాల రాకపోకలకు ఇబ్బంది కలగటంతో 150 సంఖ్యకు పడిపోయిందన్నారు. కొత్త కళాశాల నిర్మించటంతో ప్రస్తుతం 1400 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. డిగ్రీలో కొత్త కోర్సులతో పాటు పీజీ కోర్సులు కూడా పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.



యార్లగడ్డ వెంకట్రావును అభినందిస్తున్న రంగన్నగూడెం తెలుగుయువత

కూటమి గెలుపునకు యువత విశేష కృషి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 7: అడ్డంకులను, అక్రమ కేసులను అధిగమించి గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ కూటమి గెలుపునకు యువత విశేష కృషి చేశారని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడలోని కార్యాలయంలో యార్లగడ్డ వెంకట్రావును రంగన్నగూడెం తెలుగుయువత సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. దాడులకు భయపడకుండా నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కో ఆర్డినేటర్‌గా ఆళ్ల గోపాలకృష్ణ పనిచేశారన్నారు. నియోజకవర్గంలో టీడీపీ అభివృద్ధితో పాటు యువత భవిష్యత్తుకు సహకారమందిస్తానని తెలిపారు. ఆళ్లను శాలువాతో సత్కరించారు. తెలుగు యువత నాయకులు వెనిగళ్ల జ్ఞానశేఖర్, మందపాటి రాంబాబు, ఆళ్ల లీలాకృష్ణ, నెరుసు వెంకటేశ్వరరావు, ఆళ్ల మనోజ్‌కుమార్, కొలుసు రంగారావు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

● యార్లగడ్డను కలసిన గన్నవరం పోలీసులు

గన్నవరం, జూన్ 7: ఎమ్మెల్యేగా గెలుపొందిన యార్లగడ్డ వెంకట్రావును గన్నవరం పోలీసులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జయసూర్య, సీఐలు ప్రసాద్, నవీన్ నరసింహమూర్తి, వి.పెదిరాజు, ఎస్సైలు కనకదుర్గ, శివప్రసాద్, పైడిబాబు, రవిచంద్ర పాల్గొన్నారు.



యార్లగడ్డ వెంకట్రావుకు మొక్క అందజేస్తున్న పోలీసులు







ఉయ్యూరు 2వ వార్డులో విజయోత్సవంలో పాల్గొన్న బోడె ప్రసాద్, శుభాకాంక్షలు చెబుతున్న గండిగుంట గ్రామస్థులు, రేషన్ డీలర్ల సంఘం నాయకులు

అరాచక ప్రభుత్వాన్ని కుప్పకూల్చారు

● విజయోత్సవంలో బోడె ప్రసాద్

ఉయ్యూరు, జూన్ 7: "ఐదేళ్లపాటు అరాచకపాలన చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓటు అనే తూటా పేల్చి కుప్పకూల్చారు. జోగి రమేశ్ ఎన్నికల్లో ఓడిపోతే అన్నీ సర్దుకుని అడ్రస్ లేకుండా పోతాడని నేను ముందే చెప్పా. ఇప్పుడదే నిజమైంది. టీడీపీ కూటమిని గెలిపించి అభివృద్ధికి ప్రజలు బాట వేశారు." అని పెనమలూరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన బోడె ప్రసాద్ అన్నారు. టీడీపీ ఉయ్యూరు పట్టణాధ్యక్షుడు జంపాన గుర్నాథరావు ఆధ్వర్యంలో 2వ వార్డులో శుక్రవారం విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. బోడె ప్రసాద్ పాల్గొని పార్టీ జెండా ఎగరేశారు. ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, కౌన్సిలర్ సుధారాణి, మాజీ చైర్మన్లు పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నజీర్, నాయకులు అల్‌రియాజ్, శివ, నరేశ్, కుటుంబరావు, ఆంజనేయులు, అప్పలనాయుడు, వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు మహాలక్ష్మి, కార్తికేయ పాల్గొన్నారు. బోడె ప్రసాద్‌కు గండిగుంటకు చెందిన టీడీపీ నాయకుడు వల్లభనేని నాగభూషణరావు(భూషయ్య), సామాజికవేత్త సజ్జా వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.

బోడె ప్రసాద్‌కు రేషన్ డీలర్ల సత్కారం

కంకిపాడు: రేషన్ డీలర్లకు అండగా ఉంటానని పెనమలూరు ఎమ్మెల్యేగా విజయం సాధించిన బోడె ప్రసాద్ హామీ ఇచ్చారని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంసీహెచ్ ఖాశీం అన్నారు. పెనమలూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన బోడె ప్రసాద్‌ను శుక్రవారం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అసోసియేషన్ ప్రతినిధులు గొరిపర్తి రామారావు, దేవరపల్లి కామేశ్వరరావు, వీరంకి గంగాధర్‌రావు, ఉప్పలపాటి శివ, మోదుగుమూడి రామకృష్ణ, ఆంటోని, అమ్మాజి, గజేంద్రరావు పాల్గొన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చలసాని సాంబశివరావు, సురేష్, ఓకా వరుణ్, ముప్పవరపు రాము, ఎంపీటీసీ పొనుగుమాటి నాగేశ్వరరావు తదితరులు బోడె ప్రసాద్‌ను సత్కరించారు.



బోడె ప్రసాద్‌ను అభినందిస్తున్న పెదపులిపాక గ్రామస్థులు

ప్రభుత్వ ఉద్యోగుల అభినందన

పెనమలూరు: ఎన్నికల కోడ్ ముగియడంతో మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు బోడె ప్రసాద్‌కు అభినందనలు తెలపడానికి పోరంకి టీడీపీ కార్యాలయానికి పోటెత్తారు. తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, పెనమలూరు తహసీల్దారు ఆధ్వర్యంలో బోడె ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.పెదపులిపాకకు చెందిన టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు బోడె ప్రసాద్‌ను అభినందించారు.

యనమలకుదురులో విజయోత్సవం

పెనమ లూరు: మండలంలోని యనమలకుదురులో టీడీపీ కూటమి విజయోత్సవాన్ని నిర్వహించారు. టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, తాడిగడప కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐదు వేల మందికి అన్న సంతర్పణ చేశారు.



అన్న సంతర్పణలో భోజనాలు వడ్డిస్తున్న వెలగపూడి శంకరబాబు, మొక్కపాటి శ్రీనివాస్



తంబి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న యార్లగడ్డ జ్ఞానేశ్వరి, టీడీపీ నేతలు

జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో

టీడీపీ నేతల మొక్కులు

ఉంగుటూరు, జూన్ 7: కూటమి ఘన విజయం సాధించడంతో టీడీపీ నేతలు పెదఅవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో మొక్కులు చెల్లించుకున్నారు. గన్నవరంలో యార్లగడ్డ వెంకట్రావు భారీ మెజారిటీతో గెలుపొంది, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో 101 టెంకాయలు కొడతానని టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్యకృష్ణ ఎన్నికల ముందు మొక్కుకున్నారు. మొక్కు ఫలప్రదం కావడంతో శుక్రవారం యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి, పార్టీ గ్రామ నాయకుల సమక్షంలో ఆమె మొక్కును తీర్చుకున్నారు. తంబి గృహం, సమాధిని సందర్శించి, కొవ్వొత్తులు వెలిగించి, ప్రార్థనలు చేశారు. జ్ఞానేశ్వరితో 101 టెంకాయలు కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. లక్ష్మీ శ్రీకాంత్, మున్నా రామకృష్ణ, కుందేటి చంద్రశేఖర్, కొండేటి కొండలరావు, కొండేటి వెంకటేశ్వరరావు, యార్లగడ్డ విజయ్‌బాబు, యార్లగడ్డ లక్ష్మయ్య, పరసా కిరణ్, వేగే సూర్యనారాయణ, మరీదు శ్రీదర్, గొట్టుముక్కల కృష్ణారావు, కుందేటి నాని, కాట్నేని శివనాగేశ్వరరావు, గుండపనేని రాజేంద్ర, నవులూరు శివయ్య, వీరంకి రంగారావు, జోజిబాబు, మేడేపల్లి రమ పాల్గొన్నారు.

యార్లగడ్డ గెలిచారని కాలినడకన జోసఫ్ తంబి చర్చికి..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గన్నవరం ఎమ్మెల్యేగా యార్లగడ్డ వెంకట్రావు అఖండ మెజారిటీతో విజయం సాధించడంతో ఆయన అభిమాని కె.సీతారాంపురం గ్రామానికి చెందిన అమృతరావు తన కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం జోసఫ్‌తంబి చర్చిలో మొక్కులు తీర్చేందుకు కాలినడకన వెళ్లారు. ఎన్నికల ముందు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా తన ఇంటికి వచ్చిన యార్లగడ్డ వెంకట్రావు భారీ మెజారిటీతో గెలవాలని మొక్కుకున్నట్లు ఆయన సమక్షంలోనే అమృతరావు తెలిపారు. లక్కపాముల రాజు, మరియమ్మ, లక్కపాముల పుష్పలత, కొడాలి తంబి, కటాక్షం, జనపరెడ్డి నాగమణి కాలినడకన చర్చికి వెళ్లారు.



మొక్కు తీర్చుకోవడానికి వెళుతున్న కె.సీతారాంపురానికి చెందిన అమృతరావు కుటుంబసభ్యులు

హాస్పిటల్‌కు బెడ్ వితరణ

ఉయ్యూరు, జూన్ 7: ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి వ్యాపారవేత్త మూల్పూరి రామ్‌ప్రసాద్ బెనర్జీ బెడ్ అందజేశారు. బెనర్జీకి డాక్టర్ మురళి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీచైర్మన్ జయదేవ్ కృతజ్ఞతలు తెలిపారు.



మద్దూరు సెంటర్‌లో నిలిచిన వర్షపు నీరు


భారీ వర్షం..నీట మునిగిన రహదారులు

కంకిపాడు, జూన్ 7: మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారులు నీటమునిగాయి. రహదారులపై ప్రయాణించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గోసాల-వణుకూరు-మద్దూరు, కంకిపాడు- పునాదిపాడు, కంకిపాడు-గొడవర్రు, జగన్నాధపురం-తెన్నేరు, ఉప్పలూరు-వేల్పూరు ప్రధాన రహదారుల గోతుల్లో నీరు చేరింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజవకర్గంలో ప్రధాన రహదారులు అభివృద్ధికి నోచుకోలేదని, కంకిపాడు మండలంలో ప్రాధాన్య క్రమంలో రహదారులను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు.



పునాదిపాడు ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

చంద్రబాబుకు వైవీబీ శుభాకాంక్షలు



ఉయ్యూరు, జూన్ 7: రాష్ట్రంలో కూటమి ఘనవిజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం చంద్రబాబును కలసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడే ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించి స్వర్ణాంధ్రసాధనకు కృషి చేస్తుందన్నారు.

గన్నవరంలో వైసీపీ కార్యాలయం ఖాళీ

గన్నవరం: గన్నవరంలో వైసీపీ కార్యాలయాన్ని ఖాళీ చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన వల్లభనేని వంశీ ఘోర పరాజయం చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైసీపీ కార్యాలయం ఎదుట పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం వైసీపీ కార్యాలయం వద్ద ఉన్న బ్యానర్లు తొలగించారు. సామగ్రిని కూడా మరో చోటకు తరలించారు. ఇందులో హాస్పిటల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది.



కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు

ఎన్టీఆర్ గవర్నమెంట్ హాస్పిటల్‌గా పేరు మారుస్తాం

● ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మండవ జయదేవ్
● వైఎస్సార్ పేరు స్థానంలో ఎన్టీఆర్ అని బ్యానర్ ఏర్పాటు



ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల నూతన భవనంపై వైఎస్సార్ పేరు ఉన్న చోట ఎన్టీఆర్ అని బ్యానర్ పెడుతున్న మండవ జయదేవ్



ఉయ్యూరులో పాత వాటర్ ట్యాంక్ దగ్గర వార్డు సచివాలయంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని బ్యానర్

ఉయ్యూరు, జూన్ 7: ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రి పేరును ఎన్టీఆర్ గవర్నమెంట్ హాస్పిటల్‌గా మార్చుతామని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ మండవ జయదేవ్ తెలిపారు. ఉయ్యూరులో గవర్నమెంట్ హాస్పిటల్ నూతన భవనంపై వైఎస్సార్ గవర్నమెంట్ హాస్పిటల్ పేరున్న చోట వైఎస్సార్ పేరు స్థానంలో ఎన్టీఆర్ పేరున్న బ్యానర్‌ను శుక్రవారం ఆయన ఏర్పాటుచేశారు. శివాలయం రోడ్డులో పాతవాటర్ ట్యాంక్ వద్ద వార్డు సచివాలయం వద్ద 10వ వార్డు కౌన్సిలర్ పలియాల శ్రీనివాస్‌తో కలిసి అన్న క్యాంటీన్ అనే బ్యానర్ ఏర్పాటు చేశారు. అన్న క్యాంటీన్‌గా ఉన్న భవనాన్ని వైసీపీ ప్రభుత్వం వార్డు సచివాలయంగా మార్చిందని తిరిగి ఆ భవనంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

ధర్మప్రచారం కరపత్రాల ఆవిష్కరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 7: సనాతన హిందూ ధర్మ పరిరక్షణతో పాటు సంస్కృతి సంప్రదాయాలను యువతకు తెలియజెప్పేందుకు ఇంటింటికీ ధర్మ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ధర్మ ప్రచారక్ ముద్దు సాయిరాం అన్నారు. వేలేరు అడ్డరోడ్డు వద్ద సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో 16వ విడత ఇంటింటికీ ధర్మప్రచారం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. గన్నవరం ఖండ కార్యనిర్వాహక్ ఎదురువాడ శ్రీనివాసరావు, జిల్లా ధర్మప్రచారక్ జయశంకర్, సబ్ డివిజన్ ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు పాల్గొన్నారు.

జంక్షన్‌లో చాగంటి ప్రవచనం రేపు

హనుమాన్‌జంక్షన్, జూన్ 7: ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు భక్తి ప్రవచన కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి అభయాంజనేయ స్వామి ఆలయం వెనుక ఏర్పాటు చేసిన వేదికపై నిర్వహిస్తున్నట్లు ఈవో కె.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. అభిరుచి ఉన్నవారు హాజరవ్వాలని సూచించారు.

విలేకరి స్థలం మహిళ ఆక్రమణ

● తొలగించడానికి వచ్చిన అధికారుల వద్ద వ్యవసాయశాఖ ఉద్యోగి హల్‌చల్



వ్యవసాయ శాఖ ఉద్యోగి షరీఫ్

పెనమలూరు, జూన్ 7: విలేకరికి రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలాన్ని మహిళ ఆక్రమించింది. రెవెన్యూ, మునిసిపల్ అధికారుల ఆదేశాలతో ఆక్రమణలు తొలగిస్తుండగా వ్యవసాయ శాఖ ఉద్యోగి హల్‌చల్ చేశాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. మూడేళ్ల క్రితం మండలంలోని కొందరు విలేకరులకు పోరంకిలో నివాస స్థలాలు కేటాయించారు. ఆ స్థలం తమదని ఓ మహిళ తన పేరిట మునిసిపల్ పన్ను, విద్యుత్ బిల్లును సృష్టించుకుని స్థలం తనదని బోర్డు పెట్టింది. దీంతో ఆ విలేకరి రెవెన్యూ, పోలీసు, మునిసిపల్ అధికారులను న్యాయం చేయమని కోరాడు. తనకు ఇచ్చిన రెవెన్యూ పట్టా తదితర పత్రాలను సమర్పించాడు. దీంతో శుక్రవారం నూతన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచనలతో మునిసిపల్, రెవెన్యూ అధికారులు విలేకరికి పొజిషన్ చూపించేందుకు వచ్చి ఆక్రమణలు తొలగిస్తుండగా పెదపులిపాకలో వ్యవసాయ శాఖ సహాయకుడిగా పనిచేస్తున్న షరీఫ్ హల్‌చల్ చేశాడు. దీనిపై ఏవో శైలజ, ఈవో పద్మావతిని వివరణ కోరగా అతని ప్రవర్తన మొదటి నుంచి ఇబ్బందికరంగా ఉందని, ప్రభుత్వ ఉద్యోగి భార్యకు నివాసస్థలం యోగ్యత లేదని..తామెవరికీ రికమండ్ చేయలేదని స్పష్టం చేశారు. దీంతో వెనువెంటనే ప్రభుత్వ అధికారులు ఆక్రమణలను తొలిగించారు.

లోకేశ్‌కు అభినందన

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 7: టీడీపీ కూటమి గెలుపునకు మహిళాశక్తి అందించిన సహకారం మరువలేనిదని నారా లోకేశ్ కొనియాడారు. మంగళగిరిలో భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన సందర్భంగా నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో శుక్రవారం తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, సురేంద్ర కుమార్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. వారితో ఉన్న సాయికల్యాణి కుమారుడు సాయిశోభన్ చౌదరిని ఆప్యాయంగా పలకరించారు.



లోకేశ్‌ను అభినందిస్తున్న మూల్పూరి సాయికల్యాణి, సురేంద్రకుమార్

నాదెండ్ల మనోహర్‌కు సత్కారం


కంకిపాడు, జూన్ 7: తెనాలి ఎమ్మెల్యేగా గెలుపొందిన నాదెండ్ల మనోహర్‌ను జనసేన పార్టీ ప్రచార కమిటీ జిల్లా కో-ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు, ఆ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సుంకర శివ, కిషోర్, ఓంకార్, కుంటా గంగాధర్, ముప్పా చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నాదెండ్ల మనోహర్‌ను సత్కరిస్తున్న పులి కామేశ్వరరావు

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

గన్నవరం, జూన్ 7: మండలంలోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ముగిశాయి. ముస్తాబాద గ్రేడ్-3 గ్రంథాలయంలో 24రోజులుగా వివిధ పోటీల్లో రాణించిన వారికి శుక్రవారం సర్టిఫికెట్లను అందజేశారు. గ్రంథాలయ అధికారి కె.జ్యోతికుమారి పాల్గొన్నారు. **కంకిపాడు:** వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు కంకిపాడు గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. **ఉంగుటూరు:** మానికొండ, ఉంగుటూరు, ఆత్కూరు, తేలప్రోలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞానశిబిరాలు ముగిశాయి. ఉంగుటూరు గ్రంథాలయంలో బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా ఎంఈవో-2 జె.సాంబశివరావు హాజరయ్యారు. వివిధపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి యు.చంద్రశేఖరరావు పాల్గొన్నారు. మానికొండ గ్రంథాలయంలో వేసవి విజ్ఞానశిబిరం ముగింపు సభలో జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.శివరామకృష్ణ వివిధపోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. గ్రంథాలయాధికారి ఎల్.హరికృష్ణ పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్:** వీరవల్లి గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో ఆటలపోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెటలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి శ్యామలరావు రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి బాబూరావు, కోడెబోయిన బాబి, శివ, బ్రహ్మచారి పాల్గొన్నారు.





విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త మృతి



శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 7 : చిన్నాపురం గ్రామంలో టీడీపీ కార్యకర్త పీతా శ్రీనివాసరావు (38) విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందాడు. శ్రీనివాసరావు భౌతికకాయాన్ని ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గ్రామసర్పంచ్ కాగిత గోపాలరావు, టీడీపీ నాయకులు కొక్కిలిగడ్డ నాగ రమేష్ తదితరులు ఉన్నారు.



రవీంద్రకు స్వీటు తినిపిస్తున్న టీడీపీ కార్పొరేటర్ నాగరాము



కాగిత కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న గోపు సత్యనారాయణ



బుద్ధప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్జీవో నేతలు



కొనకళ్లను సత్కరిస్తున్న చల్లపల్లి, ఘంటసాల నేతలు



కుమార్‌రాజాకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

అభినందనల వెల్లువ

మచిలీపట్నం టౌన్, జూన్ 7 : కూటమి ప్రభంజనంతో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కొల్లు రవీంద్ర, కాగిత కృష్ణప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా, బుద్ధప్రసాద్‌లకు అన్ని వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. భారీ మెజార్టీతో ఎన్నికైన కొల్లు రవీంద్రను శుక్రవారం టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, దేవరపల్లి అనిత సత్కరించారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** మండలి బుద్ధప్రసాద్‌ను తూర్పు కృష్ణా ఎన్జీవో సంఘం ఉపాధ్యక్షుడు బండ్రెడ్డి రాజేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. దివి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, పద్మ, కోశాధికారి వెంకటేశ్వరరావు, కార్యవర్గసభ్యులు వెంకటస్వామి, శేషగిరి, అనురాధ, నాగమణి, బాల, చిల్ల అమరావతి, సుబ్రహ్మణ్యం, ఏ.తారక మస్తాన్ పాల్గొన్నారు. నాగాయలంక మత్స్యకార నేతలు లకనం నాగాంజనేయులు, నాగిడి తాతారావు, కర్రి కృష్ణమూర్తి, రేవు సువర్ణ రాజు, అవనిగడ్డ వెంకటేశ్వరరావు, సైకం విజయభాస్కర్, కొల్లు నాగబాబు, సత్యనారాయణ, గొందియ్య, గోపి, బొడ్డు రామ్మోహనరావు, సత్యనారాయణ తదితరులు బుద్ధప్రసాద్‌ను సత్కరించారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు మండలి బుద్ధప్రసాద్‌ను సత్కరించారు. జిల్లా అధ్యక్షులు జి.గోపిచంద్, ఉపాధ్యక్షులు సాయిబాబు, సంయుక్త కార్యదర్శి వేమూరి లావణ్య, టి.శ్రావంత్, ట్రెజరర్ కడవకొల్లు నవీన్, సంఘ నాయకులు సుబ్బారావు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. మండలి బుద్ధప్రసాద్‌ను డీఈవో తాహెరా సుల్తానా ఘనంగా సత్కరించారు. శుక్రవారం సాయంత్రం ఆమె మండలిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండలి వెంకట్రామ్, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు. **మోపిదేవి :** ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు పెదప్రోలు సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు విజయోత్సవం నిర్వహించారు. సర్పంచ్ పోలిమెట్ల ఏసు బాబు, ఉద్యోగులు నాగార్జున, దుర్గా ప్రసాద్, మౌనిక తదితరులు ఉన్నారు. **చల్లపల్లి :** కూటమి భారీ విజయం నేపథ్యంలో టీడీపీ, జనసేన నేతలు గ్రామాల్లో కేక్ కటింగ్ చేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎస్టీ కాలనీలో జరిగిన వేడుకలో ఉపసర్పంచ్ ముమ్మనేని నాని ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్‌చేశారు. తెలుగుయువత, జనసైనికులు సందడి చేశా రు. నాని ఇంటి వద్ద ముమ్మనేని సన్నీ ఆధ్వర్యంలో టపాసులు పేల్చి, టీడీపీ కార్యకర్తలను సన్మానించారు. **అవనిగడ్డ :** తెనాలి నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన జనసేన పార్టీ రాజకీయ వ్యవహారల సలహా కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను అవనిగడ్డ మండల జనసేన నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. మనోహర్‌ను ఘనంగా సత్కరించారు. జనసేన నేతలు రాయపూడి వేణుగోపాలరావు, చందుబాబు, అన్నపరెడ్డి ఏసుబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. **పామర్రు :** పామర్రు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఎన్నికైన వర్లకుమార్ రాజాను అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్పీ పిశ్రీకాంత్, సీఐలు శుభాకర్, కిషోర్‌బాబు, గృహ నిర్మాణశాఖ డీఈ నిరీక్షణ రావు, ఏఈఈ ఎంపీడీవోలు స్వర్ణలత, రామకృష్ణ, మల్లేశ్వరి, సచివాలయ కార్యదర్శులు పాపినేని సూర్యకళ, ఎశిరీషా, పంచాయతీ కార్యదర్శులు పూర్ణేశ్వరి ఎన్జీవో సంఘ నేతలు సునీల్, శంకర్‌దాదా, తహసీల్దార్ శ్రీపల్లవి ఇతర సిబ్బంది తదితరులతోపాటు జనసేన జిల్లా పార్టీ అధ్యక్షుడు బండి రామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, బీజేపీ నాయకులు యార్లగడ్డ రాంబాబు, టీడీపీ నేత జక్కా శ్రీనివాసరావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కొనకళ్ల సోదరులకు సన్మానం

చల్లపల్లి : కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించి అధికారంలోకి రావటం, జిల్లాలో క్లీన్ స్వీప్ చేసిన నేపథ్యంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర నేత కొనకళ్ల బుల్లయ్యను చల్లపల్లి, ఘంటసాల మండల టీడీపీ నేతలు సత్కరించారు. మచిలీపట్నంలోని కొనకళ్ల స్వగృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, ముమ్మనేని నాని, అయినపూడి భానుప్రకాష్, గుత్తికొండ ప్రసాద్, పరిశె చలపతిరావు, లక్ష్మణరావు, అంబటి భువనేశ్వరరావు ఉన్నారు. **మచిలీపట్నం :** కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావును హెల్పింగ్ స్పాట్ సంస్థ అధ్యక్షుడు వెంట్రప్రగడ భార్గవ్ తదితరులు ఘనంగా సత్కరించారు. హెల్పింగ్ స్పాట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనకళ్ళ నారాయణరావు, బుల్లయ్య అభినందించారు.



ప్రతిపాదనలపై సంతకాలు చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

మున్సిపల్ ఆఫీసుకు కరారి సత్యం, పార్కుకు రావి శోభనాద్రిచౌదరి పేరు

● కమిషనర్‌కు ఎమ్మెల్యే వెనిగండ్ల ఆదేశం

గుడివాడ : గుడివాడమున్సిపల్ కార్యాలయానికి స్వర్గీయ కరారి సత్యనారాయణరావు పేరు, రాజేంద్రనగర్‌లోని మున్సిపల్ పార్కుకు మాజీ ఎమ్మెల్యే రావి శోభనాద్రిచౌదరి పేరును పెట్టాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులను కోరారు. ప్రజావేదికలో ఈ మేరకు ప్రతిపాదనలపై సంతకాలు చేసి మున్సిపల్ కమిషనర్‌కు పంపించారు. మున్సిపల్ కార్యాలయానికి కరారి, పార్కుకు శోభనాద్రి వంటి మహనీయుల పేర్లు పెట్టడం సమంజసమన్నారు. ఎమ్మెల్యేలుగా కరారి, రావి బడుగు, బలహీన, వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. తాను మాటల మనిషిని కాదని చేతల మనిషిని అని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ , టిడిపి నాయకులు పాల్గొన్నారు.

స్టేడియంలో జాతీయ క్రీడలకు ప్రోత్సాహం

ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ క్రీడలు నిర్వహించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావులతో కలిసి మున్సిపల్ కార్యాలయం, ఎన్టీఆర్ స్టేడియాలను సందర్శించారు. తొలుత స్టేడియం ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఆరోగ్య రక్షణ కోసం పారిశుధ్యం మెరుగుకు అధికారులు కృషి చేయాలన్నారు. విధుల నిర్వహణలో ఎటువంటి అలసత్వం ఉండరాదన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాగిత కృష్ణప్రసాద్‌కు సత్కారం

మచిలీపట్నం టౌన్ : రైతుల సంక్షేమానికి నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కాగిత కృష్ణప్రసాద్‌ను గోపు సత్యనారాయణకలిసి శుభాకాంక్షలు తెలిపి రైతు సమస్యలపై చర్చించారు. **పెడన :** పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌ను బీజేపీ నాయకులు సత్కరించారు. పుప్పాల రాము, మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, కొల్లూరి రాధాకృష్ణ, బండ్రెడ్డి నాగాంజనేయులు, పాలెపోగు లక్ష్మి, ఏసురాజు, గంగాధరావు, రజనికుమార్ పాల్గొన్నారు. కాగిత కృష్ణప్రసాద్‌ను కమిషనర్ బి. వెంకట్రామయ్య, మేనేజర్ వి. నాగేశ్వరరావు, పామర్తి జితేంద్ర తదితరులు అభినందించారు. **బంటుమిల్లి :** కాగిత కృష్ణప్రసాద్‌ను శుక్రవారం పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. మచిలీపట్నం జనసేన ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువా, గజమాలలతో ఘనంగా సన్మానించారు. డీఎస్పీ ఎండి అబ్దుల్ సుభానీ ఆధ్వర్యంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు కాగిత కృష్ణప్రసాద్‌ను కలిసి అభినందనలు తెలిపారు. జనసేన నాయకులు గడ్డం రాజు, మహ్మద్ సమీర్, గణేష్, రామజ్యోతిమైకేల్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగప్రసాద్, గూడూరు ఎస్సై వీరరాజు, పెడన ఎస్సైలు సూర్యతేజ, సత్యనారాయణ, బంటుమిల్లి ఎస్సై వాసు, కృత్తివెన్ను ఎస్సై నాగరాజు తదితరులు కాగితకు అభినందనలు తెలిపారు.



వెనిగండ్లకు గుడ్లవల్లేరు నేతల శుభాకాంక్షలు

గుడ్లవల్లేరు : గుడివాడ ఎమ్మెల్యేలగా రికార్డు స్థాయిలో విజయం సాధించిన వెనిగండ్ల రామును శుక్రవారం మండలంలోని పలు గ్రామాల టీడీపీ నాయకులు ప్రజావేదికలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాపరిషత్ మాజీ వైస్ ఛైర్‌పర్సన్ శాయిన పుష్పావతి, ఎస్‌వీఎస్ ప్రసాద్, చాపరాల రాజేశ్వరరావు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, నాని, తెల్లాకుల నాగలక్ష్మి, తూము పద్మజ, నిమ్మగడ్డ శశికళ, సత్తిబాబు తదితరులు కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులను సత్కరించారు.

మండలికి గ్రీన్ అంబాసిడర్ల వినతి

అవనిగడ్డ రూరల్ : ఏడాదిగా వేతనాలు ఇవ్వటం లేదని అవనిగడ్డ పంచాయతీకి చెందిన 30 మంది గ్రీన్ అంబాసిడర్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను శుక్రవారం కలసి తమ గోడు చెప్పుకున్నారు. వేతనాలు కొన్ని నెలల క్రితమే డ్రా చేసిన తమకు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమకు న్యాయం చేయాలని కోరారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని మండలి హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు : మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారి గోపి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లు, విద్యుత్‌సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యం లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. **గుడివాడ :** విద్యుత్ లైన్లు, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం పట్టణ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

పూడికతీత మట్టిని తొలగించండి

మోపిదేవి : రావివారిపాలెం నుంచి చిరువోలు వరకు ఉన్న డ్రైనేజీ పూడికతీత మట్టిని ప్రజలకు ఇబ్బంది లేకుండా తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. రావి వారిపాలెం నుంచి చిరువోలు వెళ్లే డ్రైనేజీని పూడికతీత చేపట్టి మట్టిని పొలంలోనూ, రహదారి వెంబడి వేయటంపై గ్రామస్తులు, రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. డ్రైనేజీ శాఖ ఏఈ హరీష్ శుక్రవారం డ్రైనేజీ పనులను పరిశీలించేందుకు విచ్చేయగా, టీడీపీ సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు, రైతులు, సమస్య ను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని ఏఈ రైతులకు హామీ ఇచ్చారు.

వృద్ధులకు అన్నదానం, దుప్పట్ల పంపిణీ

గుడివాడ : బత్తుల వీరరాఘవమ్మ మూడో వర్థంతిని పురస్కరించుకుని శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి వృద్ధాశ్రమం, కరుణాపీఠంల్లోని వృద్ధులకు బత్తుల వెంకట ప్రసాద్, సుదాకర్, కంచర్ల సామ్రాజ్యం సౌజన్యంతో అన్నదానం చేసి, దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, తిరుపతయ్య, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, కె.అజయ్‌కుమార్, ఎ.బాలాజీ, ఎస్. శ్రీనివాస్, గోపి మాధవ్, చరితశ్రీ, మోహిత్, అభిరామ్, చరణ్ తేజ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శివునికి లక్ష మల్లెల అర్చన

మచిలీపట్నం టౌన్ : బచ్చుపేట మల్లేశ్వర స్వామికి లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ముత్తేవి రవికాంత్, ఈవో చక్రధరరావు, బ్రహ్మానందశాస్త్రి పర్యవేక్షించారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

నాగాయలంక : వక్కపట్లవారిపాలెం కాలువ గట్టుపై కోత ముక్క ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి, రూ.37,040 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

కూచిపూడి : వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయని మొవ్వ ఎంఈవో శ్రీలక్ష్మీ తెలిపారు. మొవ్వ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయాధికారిణి కృష్ణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** చల్లపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు రోజైన శుక్రవారం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలనీ, గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయాధికారి కె.గణేష్‌కుమార్, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ సచివాలయ కన్వీనర్ రాజీనామా

కోడూరు : మందపాకల పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, మండల సచివాలయ కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.